JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 09-08-2026
Medchal - Malkajgiri | Sunday 09-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 69
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 | Issue 69 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## క్యాంపస్ లైఫ్.. రియల్ లైఫ్ కు
# చాలా తేడా ఉంటుది



- **దేశానికి గొప్ప సేవ చేయాలనే కలలతో ఐఐటి ఢిల్లీ నుంచి బయటకు వస్తున్నారు**

**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 8 :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) ఢిల్లీలో జరిగిన 57వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన 3,000 మందికిపైగా పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఐఐటి ఢిల్లీలోని సోనిపట్ క్యాంపస్‌లో ఏఐ ఆధారిత అత్యున్నత పనితీరు గల సూపర్ కంప్యూటింగ్ కేంద్రమైన "పరం ప్రజ్ఞ"ను కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడుతూ, వారు కేవలం డిగ్రీలతోనే కాకుండా, దేశానికి ఎంతో సేవ చేయాలనే కలలతో బయటకు వెళ్తున్నారని అన్నారు. ప్రస్తుతం విద్యార్థుల మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉండాలి అని ప్రధాని మోదీ వారితో అన్నారు. "నేనేమీ బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీలో సంఘర్షణ జరుగుతూనే ఉండాలి" అని ఆయన చమత్కరించారు. ప్రతి ఒక్కరి మనసులో తమ భవిష్యత్తుపై ఒక దృక్పథం ఉంటుందని ఆయన అన్నారు. ఐఐటి ఢిల్లీలో మొదటి రోజు నుంచి స్నాతకోత్సవం వరకు విద్యార్థుల ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ,

...మిగతాది 2 లో




## వైద్య సేవలు అందించేందుకు
# సిద్ధంగా డా.ఎంసీఆర్ టిమ్స్

- **త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం**
- **ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి**
- **ప్రారంభానికి ముందే మిగిలిన పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచన**

**జయభేరి, హైదరాబాద్ :**
ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్) సిద్ధంగా ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని మంత్రి వెల్లడించారు. హాస్పిటల్ ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లు, మౌలిక వసతులు, వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది, భద్రత, ఇతర సహాయక వ్యవస్థలను పరిశీలించేందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను సందర్శించారు. హాస్పిటల్‌లోని A, B, C బ్లాకులను మంత్రి పరిశీలించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఉద్యోగులతో మాట్లాడి సేవల నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన మంత్రి, ప్రారంభానికి ముందు పూర్తి చేయాల్సిన పనులు, అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. మిగిలిన అన్ని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, హాస్పిటల్‌ను పూర్తిస్థాయి సేవలకు సిద్ధం చేయాలని ఆరోగ్యశాఖ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. హాస్పిటల్ ప్రారంభమైన రోజు నుంచే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వ్యవస్థలు సమన్వయంతో పనిచేసేలా ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. హాస్పిటల్‌లో వైద్య సేవల నిర్వహణ, మౌలిక వసతులు, మానవ వనరులు, నాన్‌మెడికల్ సర్వీసులు,

...మిగతాది 2 లో

## 40 ఆధార్ నంబర్లకు ఏకంగా
# 80 మంది ఉద్యోగులు



- **ప్రతి ఒక్క ఆధార్ నంబర్‌పై ఇద్దరేసి ఉద్యోగులు.. వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతి నెలా జీతాలు**
- **ఒక్కో ఉద్యోగి హోదాను బట్టి నెలకు 1 లక్ష నుంచి ఏకంగా 4 లక్షల వరకు ప్రభుత్వ ధనాన్ని చట్టవిరుద్ధంగా డ్రా చేస్తున్నట్లు సమాచారం**


**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 8 :**
తెలంగాణ ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో విస్తుపోయే అక్రమం వెలుగులోకి వచ్చింది. ఒకే ఆధార్ నంబర్‌తో వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించడమే కాకుండా, నెలకు లక్షల్లో రెండు జీతాలు దర్జాగా గుంజుతున్న ఘరానా మోసం బట్టబయలైంది. రాష్ట్ర ఆర్థిక శాఖ చేపట్టిన సాంకేతిక తనిఖీల్లో ఈ దిగ్భ్రాంతికరమైన విషయం నిగ్గుతేలింది. ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఐఎఫ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో ఉద్యోగుల ఆధార్, సర్వీస్ వివరాల ధృవీకరణ చేపట్టాల్సిందిగా సర్కార్ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రాస్ చెకింగ్ ప్రక్రియలోనే అసలు అవకతవకలు బయటపడ్డాయి.ఆర్థిక శాఖ ప్రాథమిక పరిశీలన ప్రకారం..

...మిగతాది 2 లో

## గొడ్డలి పార్టీ చేసే కుట్రలను
# ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి

- **యూనిట్ ఇంఛార్జ్‌లకు శిక్షణలో సీఎం చంద్రబాబు**

**జయభేరి, తాడేపల్లి :**
టీడీపీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌లకు శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై ప్రభుత్వ పథకాలు, పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కార్యకర్తల్లో నాయకత్వం పెంపొందించడానికే శిక్షణ ఇస్తున్నాం. పార్టీ భావజలాన్ని అర్థం చేసుకోవాలి... ప్రభుత్వం చేసే మంచిని ప్రజలకు వివరించాలి. ప్రభుత్వం చేసిన మంచిని చెప్పుకోకుంటే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని అన్నారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించింది.. దానికి గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగాం. డీఎస్సీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని చక్కగా చెప్పగలిగాం కాబట్టే... గొడ్డలి పార్టీ మినహా



కొన్ని పార్టీలకు చెందిన నేతలు ఎలాంటి తప్పులు జరగలేదని బహిరంగంగానే చెబుతున్నారు. డీఎస్సీ ద్వారా రిక్రూటైన

...మిగతాది 2 లో



# ఏకగ్రీవ తీర్మానం

- **లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచవద్దు!**
- **ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను అలాగే కొనసాగించాలి**
- **డీఎంకే, ఏఐఏడీఎంకే బహిష్కరణ**
- **డీలిమిటేషన్‌పై సమరశంఖం!**
- **కావేరీ అంశం పై మౌనం... బిల్లుపై వేగం ఏంటి?**

**జయభేరి, చెన్నై :**
కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదన దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. కేంద్రం ముసాయిదాపై రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న వేళ, తమిళగ వెట్రి కజగం అధినేత, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ అధ్యక్షతన చెన్నైలోని కళైవానర్ అరంగంలో పార్లమెంట్ సభ్యులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కీలక భేటీలో పొత్తు ధర్మాన్ని

...మిగతాది 7 లో



## కాంగ్రెస్ నేతలవి
# క్షుద్ర రాజకీయాలు

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 8 :**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు చౌకబారు క్షుద్ర రాజకీయాలకు పాల్పడుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ఆధ్యాత్మిక చింతనతో గుడికి వెళితే, దానిని 'క్షుద్ర పూజలు' అంటూ కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. గుడికి వెళ్లి దైవదర్శనం చేసుకోవడం తప్పా అని ప్రశ్నించిన కేటీఆర్, తమకు కాంగ్రెస్‌లాగా చిల్లర క్షుద్ర రాజకీయాలు చేయడం తెలియదని, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన రాష్ట్ర రాజకీయాలు (స్టేట్ పాలిటిక్స్) మాత్రమే తెలుసని స్పష్టం చేశారు. పాలన చేతగాక నిత్యం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే

...మిగతాది 2 లో



## ఆంధ్రప్రదేశ్‌లో
# ఐఏఎస్‌ల బదిలీలు

- **సీనియర్ ఐఏఎస్ ఆమ్రపాలి బదిలీ**
- **ఆమెకు నో పోస్టింగ్, దీర్ఘకాలంగా సెలవులో..**
- **జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశం**

**జయభేరి, విజయవాడ, ఆగస్టు 8 :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. వీరిలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## సిద్ధంగా డా.ఎంసీఆర్ టిమ్స్

విద్యుత్, నీటి సరఫరా, పారిశుధ్యం, భద్రత, ఫైర్ సేఫ్టీ, ఇతర వ్యవస్థలపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లోని ప్రతి విభాగం ప్రారంభానికి ముందే పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు, వారికి అవసరమైన అన్ని సహాయక సేవలు కూడా నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హాస్పిటల్‌లో పనిచేసే డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, టెక్నీషియన్లు, పరిపాలనా సిబ్బంది తదితర మానవ వనరులను అవసరానికి అనుగుణంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను రాష్ట్రంలోని ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే ప్రముఖ ప్రభుత్వ వైద్య సంస్థగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని మంత్రి తెలిపారు. అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక మౌలిక వసతులు, సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాలు, క్రిటికల్ కేర్, అత్యవసర వైద్యం, అవయవ మార్పిడి వంటి క్లిష్టమైన వైద్య సేవలను ఒకే వేదికపై అందించేలా టిమ్స్‌ను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. టిమ్స్‌లో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లోని ప్రధాన ప్రభుత్వ హాస్పిటళ్లపై ఉన్న ఒత్తిడి తగ్గడంతో పాటు, సూపర్ స్పెషాలిటీ వైద్యం అవసరమైన రోగులకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. "డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంది. హాస్పిటల్ ప్రారంభానికి సంబంధించిన మిగిలిన ఏర్పాట్లను వేగంగా పూర్తి చేస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా హాస్పిటల్‌ను త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రారంభం నుంచే రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నాం" అని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, ఆరోగ్యశాఖ, ఆర్అండ్‌బీ తదితర శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, టిమ్స్ వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 80 మంది ఉద్యోగులు

కేవలం 40 ఆధార్ నంబర్లకు ఏకంగా 80 మంది ఉద్యోగుల వివరాలు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంటే ప్రతి ఒక్క ఆధార్ నంబర్‌పై ఇద్దరేసి ఉద్యోగులు వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతి నెలా జీతాలు పొందుతున్నారు. ఇందులో విస్తుపోయే అంశమేమిటంటే.. ఇలా ఒకే ఆధార్‌పై రెండేసి జీతాలు తీసుకుంటున్న వారిలో ఎక్కువ మంది రెగ్యులర్ ఉద్యోగులే ఉన్నారు. ఒక్కో ఉద్యోగి హోదాను బట్టి నెలకు 1 లక్ష నుంచి ఏకంగా 4 లక్షల వరకు ప్రభుత్వ ధనాన్ని చట్టవిరుద్ధంగా డ్రా చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, విద్యా శాఖ, పంచాయతీ రాజ్, ప్రజారోగ్య శాఖల్లో ఇలాంటి డూప్లికేట్ కేసులు ఎక్కువగా నమోదైనట్లు ఆర్థిక శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.ఐఎఫ్ఎంఐఎస్ సిస్టమ్‌లో పనిచేస్తున్న రెగ్యులర్, గ్రాంట్ ఇన్ఎయిడ్, తాత్కాలిక సిబ్బంది డేటాను ఆధార్‌తో అనుసంధానించి క్రాస్‌చెక్ చేయడంతో ఈ బండారం బయటపడింది. వేర్వేరు శాఖల్లో, వేర్వేరు పేర్లతో ఉద్యోగాలు చేస్తూ ఒకే ఆధార్‌ను ఉపయోగించడం వెనుక పెద్ద ఎత్తున సాంకేతిక అక్రమాలు లేదా ఐడెంటిటీ ఫ్రాడ్ ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం.. డూప్లికేట్ ఆధార్ మ్యాపింగ్‌లపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ సంస్థలు లేదా శాఖల నుంచి అక్రమంగా జీతాలు పొందినట్లు రుజువైతే సదరు ఉద్యోగులపై తక్షణమే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు, ఇప్పటివరకు అక్రమంగా డ్రా చేసిన ప్రభుత్వ సొమ్మును పైసా సైతం వదలకుండా రికవరీ చేయాలని స్పష్టం చేసింది. తీవ్రమైన అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదేశించింది. అంతటితో ఆగకుండా.. ఈ అవకతవకలకు సహకరించిన, లేదా డ్రాయింగ్ అండ్ డిస్‌బర్సింగ్ స్థాయిలో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించి వారిపై కూడా చర్యలు తీసుకోనున్నారు. ఈ వ్యవహారంపై అన్ని శాఖలు తక్షణమే దృష్టి సారించి, సమగ్ర విచారణ, రికవరీ, క్రిమినల్ చర్యల వివరాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌ను సరిగ్గా 7 రోజుల్లోగా తమకు సమర్పించాలని ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ స్కామ్‌తో సంబంధం ఉన్న ఉద్యోగుల్లో, సహకరించిన అధికారుల్లో తీవ్ర భయాందోళనలు మొదలయ్యాయి.

## కాంగ్రెస్ నేతలవి క్షుద్ర రాజకీయాలు

ప్రతిపక్ష నాయకుల వ్యక్తిగత, ఆధ్యాత్మిక విశ్వాసాలపై కాంగ్రెస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర నీటి హక్కులకు సంబంధించి గోదావరి నదీ యాజమాన్య బోర్డు అజెండాలో ప్రతిపాదించిన 7 వివాదాస్పద అంశాలపై బీఆర్ఎస్ గళమెత్తినా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని కేటీఆర్ తప్పుపట్టారు. తెలంగాణ ప్రయోజనాలకు గండికొట్టేలా ఉన్న ఆ 7 అంశాలపై ఎందుకు మౌనంగా ఉన్నారో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కీలకమైన నదీ జలాలు, ప్రాజెక్టుల హక్కులను కాపాడుకోవడంలో పూర్తిగా విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ప్రజల దృష్టిని మళ్లించడానికే హరీశ్ రావు పూజల అంశాన్ని తెరపైకి తెచ్చి రాజకీయం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రయోజనాల కోసం, రైతుల నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో ఐఏఎస్‌ల బదిలీలు

ఎండీ కాటా ఆమ్రపాలి కూడా బదిలీ అయ్యారు. దీర్ఘకాలంగా సెలవులో ఉన్న ఆమ్రపాలి కాటాను సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏపీటీడీసీ ఎండీగా రవి సుభాష్‌ను నియమించింది. ఆయన ప్రస్తుతం నిర్వహిస్తున్న ఏపీపీఎస్సీ కార్యదర్శి పోస్టుతోపాటు, ఏపీటీఏ సీఈవోగా పూర్తిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ బదిలీలలో ఐఏఎస్ ఆమ్రపాలికి ఎలాంటి పోస్ట్ ఇవ్వలేదు.. కేవలం జీఏడీలో రిపోర్టు చేయాలని సూచించారు. 2014 ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో 2010 బ్యాచ్‌కు చెందిన ఆమ్రపాలిని డీవోపీటీ (కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ) మొదట ఆంధ్రప్రదశ్‌కు కేటాయించింది. ఆమె మాత్రం తెలంగాణలోనే పనిచేశారు.. తనను డీవోపీటీ ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించడాన్ని సవాలు చేస్తూ ఆమ్రపాలి క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్ హైదరాబాద్ బెంచ్, ఆమెను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించింది. వెంటనే డీవోపీటీ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వుల్ని తెలంగాణ హైకోర్టులో సవాల్ చేసింది.. ఈ పిటిషన్‌పై విచారణ చేసిన హైకోర్టు క్యాట్ తీర్పుపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు స్టేతో ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు.. రాష్ట్రప్రభుత్వం పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ (APTDC) ఎండీగా నియమించారు. ఆమ్రపాలి ఏపీ పర్యాటకశాఖ ఎండీ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.. కానీ గత మూడు నెలలుగా వరుసగా సెలవుల్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆమెను బదిలీ చేయడం ఆసక్తికరంగా మారింది. ఆమె తెలంగాణ కేడర్‌లో కొనసాగేందుకు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. మరి ఏపీ ప్రభుత్వం ప్రస్తుతానికి ఆమెను జీఏడీలో రిపోర్ట్ చేయమని ఆదేశించింది. మరి ఆమ్రపాలికి ఏపీ ప్రభుత్వం ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఆమె సెలవులోనే ఉన్నట్లు సమాచారం.. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది. అంతేకాదు ఈ బదిలీల్లో చాలామంది సీనియర్ ఐఏఎస్ అధికారులకు స్థానచలనం తప్పలేదు.. పాఠశాల విద్యా, సాధారణ పరిపాలనశాఖ, పర్యాటకం వంటి కీలక శాఖల్లో అధికారులు బదిలీ అయ్యారు. గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేకంగా అధికారుల్ని నియమించారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవ నేపథ్యం

జయభేరి, హైదరాబాద్ :




ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రతి సంవత్సరం అధికారికంగా ఆగస్టు 9న జరపాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది. ప్రపంచ ఆదివాసి ప్రజల దినోత్సవం గజరుపుతున్నారు. ప్రపంచంలోని గిరిజనుల సాధన బాధకాలు తెలియజేయమని ఐక్యరాజ్యసమితి 1982లో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ప్రపంచవ్యాప్తంగా 5,000 తెగలు, 37 కోట్ల గిరిజనుల జనాభాను గుర్తించి, 1994 ఆగస్టు 9వ తేదీన ఈ కమిషన్ ఐక్యరాజ్యసమితికి గిరిజనులకు సంబంధించి ఒక నివేదికను అందించింది. 1996లో ఐక్యరాజ్యసమితి గిరిజనుల హక్కులపై ముఖ్యమైన తీర్మానం చేసింది. ఐక్యరాజ్యసమితి గిరిజనులకు స్వయం పరిపాలన హక్కు, సంస్కృతి, భాష, సాంప్రదాయాలను కాపాడే హక్కు, ఇతర ప్రజలు ఆక్రమించుకున్న భూములను తిరిగి స్వాధీన పరుచుకొనే హక్కు, సంఘ నిర్మాణం చేసుకునే హక్కు, భూమిని, ప్రకృతి వనరులను స్వయంగా నిర్మించుకునే హక్కు, భూమిపై గిరిజన తెగల యాజమాన్యం పోకుండా చూసే చట్టాలను చేయవలసిందిగా ప్రభుత్వాలను కోరే హక్కు, చట్టాల రూపకల్పనలో గిరిజన తెగలకు తగు ప్రాతినిధ్యము కల్పించే హక్కు, ప్రభుత్వాల నుండి రాయితీలు పొందే హక్కు, ఐక్యరాజ్యసమితిలో గిరిజన తెగలకు సభ్యత్వం కలిగియుండే హక్కు, వివిధ దేశాలలో గిరిజన తెగలపై సాగుతున్న హింసాకాండను నిలిపివేయుట వంటి హక్కులను పొందుపరచి చర్యను ప్రవేశపెట్టి, తీర్మానం చేసింది. 1997 సెప్టెంబరులో దీనిపై ఓటింగ్ పెట్టగా, 143 దేశాలు అనుకూలంగా ఓటింగ్ వేయగా, 4 దేశాలు వ్యతిరేకంగా, 11 దేశాలు తటస్థంగా ఓటింగ్‌లో పాల్గొన్నాయి.

**ఈ నేపథ్యంలో భారతదేశంలోని గిరిజనుల చరిత్రను రేఖామాత్రంగా పరిశీలిద్దాం..**

పిడితుల్లోకెల్లా అధమాధములైన గిరిజనులు తరతరాలుగా దోపిడీకి పీడనకు గురి అవుతున్నారు. మైదాన ప్రాంతం నుంచి వెళ్లిన గిరిజనేతరులు ప్రధానంగా దోపిడీదారులు వారిని దోపిడీ చేశారు. మద్రాసు అటవీ చట్టం, 1882 (1882 నాటి చట్టం V) అనేది వలసవాద కాలంలో సెప్టెంబర్ 9, 1882న రూపొందించబడి, జనవరి 1, 1883న అమలులోకి ఈ చట్టం వచ్చింది. ఇది రిజర్వ్ అడవులను సృష్టించడానికి, స్థానిక వనరుల వినియోగాన్ని నియంత్రించడానికి, అడవిలో పుట్టి అడవిలో పెరిగినటువంటి గిరిజనులను పోడు వ్యవసాయం నుండి ఆహారం కొరకు వారు సేకరించే అటవీ సంపద నుండి పోడు వ్యవసాయం గిరిజనులను దూరం చేశారు. ఖండాంతరాలు దాటి ఈ దేశానికి వచ్చిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు స్థానిక అటవీ గిరిజనులతో దారుణమైనటువంటి చాకిరీ చేయించి హింసించారు. సాంప్రదాయ గిరిజన పద్ధతులను పరిమితం చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వానికి అధికారం కల్పించింది. స్వాతంత్ర్యం తరువాత, దీనికి తమిళనాడు అటవీ చట్టం, 1882గా పేరు మార్చి అదే చట్టాన్ని మన పాలకులు స్వీకరించారు. మద్రాసు అటవీ చట్టం 1882బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మన్య ప్రాంతంలో గిరిజనులను దోపిడీ చేస్తుంటే అల్లూరి సీతారామరాజు ఆ గిరిజనులలో చైతన్యాన్ని రగిలించి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం నడిపారు. రంప పితూరిగా(192224) అది ప్రసిద్ధిగాంచినది. ఆ పోరాటంలోనే అనేకమంది గిరిజన యోధులతో పాటు ఆయన కూడా సామ్రాజ్యవాదుల తుపాకి తూటాలకు బలి అయినారు.

కొమురం భీమ్ (అక్టోబర్ 22, 1901 - అక్టోబర్ 27, 1940) నిజాం నవాబు పాలనకు, అటవీ అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా "జల్ జంగల్‌జమీన్" (అడవి, భూమి, నీరు మనవే) అనే నినాదంతో పోరాడిన గొప్ప ఆదివాసీ విప్లవ వీరుడు, గిరిజనోద్యమ నాయకుడు. ఇతనిని "గోండు బెబ్బులి" అని పిలుస్తారు. అల్లూరి సీతారామరాజు గాని, కొమరం భీమ్ కానీ కమ్యూనిస్టులు. 1946 51 వరకు భూమికోసం భుక్తి కోసం ముక్తి కోసం నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడి అమరవీరులైన 4000 మంది అమరవీరుల్లో 500 మంది గిరిజనులే. శ్రీకాకుళం గిరిజన ఉద్యమం అనేది 1967-1970 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఒక ప్రధాన సాయుధ రైతాంగ ఉద్యమం. స్థానిక కమ్యూనిస్ట్ ఉపాధ్యాయులైన వెంపటపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం నాయకత్వంలో, గిరిజన సంఘం భూకబ్జాలు, అధిక అప్పులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసులను సమీకరించి, తొలి నక్సలైట్ ఉద్యమాన్ని బలంగా ప్రభావితం చేసింది. ఈ తిరుగుబాటుకు ప్రధానకారణాలు మైదాన ప్రాంతాలకు చెందిన గిరిజనేతర భూస్వాములు, వడ్డీ వ్యాపారులు సారవంతమైన గిరిజన భూములను ఆక్రమించుకున్నారు. అధిక వడ్డీ, రుణ బానిసత్వం, చిన్న అటవీ ఉత్పత్తులకు అన్యాయంగా తక్కువ ధరలు చెల్లించడం.



మన్నవ హరిప్రసాద్
హైకోర్టు న్యాయవాది, సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్,
పొలిట్ బ్యూరో సభ్యుడు, 82477 28296
mannavahariprasad@gmail.com

అటవీ కలపను పొందడంపై, సాంప్రదాయ భూ వినియోగంపై ఆంక్షలు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో 1967 మే 25వ తేదీ తేయాకు గిరిజన రైతాంగ పోరాటం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 1959-1967 కాలంలోఅక్షరాస్యత, న్యాయమైన వేతనాలు మరియు భూమి హక్కులపై దృష్టి సారించి గిరిజన సంఘం ద్వారా శాంతియుత సమీకరణ జరిపారు. అక్టోబర్ 1967 (లేవిడి గ్రామం): గుమ్మలక్ష్మీపురంలో జరిగినటువంటి గిరిజన మహాసభకు హాజరై వెళుతున్న గిరిజన యువకులను భూస్వాములు ఇద్దరు గిరిజన కార్యకర్తలను (కోరన్న, మంగన్న) చంపడంతో, గిరిజనులు పోలీసుల పై ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. పరిస్థితి హింసాత్మకంగా మారింది. ప్రతీకార, గెరిల్లా దశ రూపం తీసుకున్నది. గిరిజనులు భూస్వాముల నుండి భూములు, ధాన్యం, ఆస్తులను స్వాధీనం చేసుకుని, సాయుధ గెరిల్లా దళాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణిచివేయడానికి 1970 ప్రారంభంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలనులను మోహరించింది, ఇది తీవ్ర అణచివేత తోపాటు బూటకపు ఎన్కౌంటర్లు జరిపింది. ఈ ఎన్‌కౌంటర్లలో వెంపటాపు త్యనారాయణ, కైలాసం, ఈ ఉద్యమానికి అన్నదండలు ఇవ్వడానికి వచ్చిన డాక్టర్ చాగంటి భాస్కరరావు దేవినేని మల్లి కార్జునుడు, కొల్లిపర రామ నరసింహ రావువంటి అగ్ర నాయకుల మరణానికి దారి తీసింది. తాబేలు నాయుడు కుటుంబ యావత్తు ఈ పోరాటంలో అమరులయ్యారు. మైదాన ప్రాంతం నుండి ఈ పోరాటానికి మద్దతుగా నాగభూషణం పట్నాయక్, భువన మోహన పట్నాయక్, పార్లమెంటు మాజీ సభ్యులు కొల్లా వెంకయ్య, పశ్చిమబెంగాల్ నుండి కానూ సన్యాల్, చారు మజుందార్, సౌరన్ బోస్, లాయర్లు, మేధావులు ఎంతో మంది ఈ ఉద్యమం లోపాల్గొన్నారు. నాటి ఉమ్మడి అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు తరిమెల నాగిరెడ్డి రాజీనామా చేసి శ్రీకాకుళ పోరాటానికి మద్దతుగా నిలబడ్డాడు. ఫలితంగా 1/70 గిరిజన చట్టం వచ్చింది. ఈ చట్టం ప్రకారం గిరిజనుల ఆస్తులు కొనరాదు.

**ఇంద్రవెల్లి ఊచకోత..**

ఇంద్రవెల్లి ఊచకోత 1981 ఏప్రిల్ 20న జరిగిన ఒక సంఘటన. అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని ఇంద్రవెల్లి గ్రామంలో, గోండ్ ఆదివాసీలు సమావేశమైన చోట పోలీసులు కాల్పులు జరిపారు. వీరిలో కొందరు కొండపల్లి సీతారామయ్య వర్గానికి చెందిన సీపీఐ (ఎం.ఎల్) ఫ్రంట్ గ్రూప్ అయిన గిరిజన రైతు కూలీ సంఘం (GRCS) ద్వారా సమీకరించబడ్డారు, మరికొందరు స్థానిక సంతకు వచ్చినవారు. ఆదివాసీలకు భూమి పట్టాలు ఇవ్వాలని, గిరిజనేతరుల ఆక్రమణలను వ్యతిరేకిస్తూ ఈ ర్యాలీ నిర్వహించబడింది. మొదట సమావేశానికి అనుమతి ఇచ్చినప్పటికీ, నక్సలైట్ల ఆందోళన జరుగుతుందనే భయంతో తర్వాత దానిని రద్దు చేశారు. గిరిజన ప్రదర్శన పైన పోలీసులు కాల్పులు జరిపారు. 50 మందికి పైగా గిరిజనులు ఇంద్రవెల్లి గోండుల గిరిజన పోరాటంలో అమరులయ్యారు. ఇతర రాష్ట్రాల్లో కూడా అనేక గిరిజన పోరాటాలు జరిగాయి. ఇది సంక్షిప్తంగా మన రాష్ట్రంలో జరిగినటువంటి కొన్ని ముఖ్య గిరిజన పోరాటాలు. ఇటీవల కాలంలో ఈశాన్య రాష్ట్రాల్లో గిరిజనులపై ప్రభుత్వమే సామూహిక హింసకాండకు పాల్పడుతున్నది. 1984లో కొండ మొదలలో గిరిజనుల భూమి పోరాటంలో రాజులన్న లక్ష్మన్న అమరులై నారు. గతసంవత్సరం మిజోరంలో కుకీ మొయితి తెగల మధ్య రిజర్వేషన్ల వైరుధ్యాన్నిరెచ్చగొట్టి మహిళలను వివస్త్రలను విశిక్షణారహితంగా హింసకాండకు పాల్పడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ నేటి వరకు ఆ రాష్ట్రాన్ని సందర్శించలేదు.

**భారత రాజ్యాంగం- షెడ్యూలు తెగలు**

భారత రాజ్యాంగంలో షెడ్యూల్ కులములకు షెడ్యూలు తెగలకు ఇచ్చిన ప్రాముఖ్యతను ఈ సందర్భంలో తెలుసుకుందాం. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంయుక్త జాతీయ కమిషన్‌ను తొలుత 1978లో ఏర్పాటు చేశారు. 1990 లో 65వ సవరణ ద్వారా దీనికి చట్టబద్ధమైన హోదా కల్పించారు. చివరకు 2003 నాటి 89వ సవరణ చట్టం కింద 2004 ఫిబ్రవరి 19న దీనిని రెండు వేర్వేరు సంస్థలుగా (NCSC, NCST) విభజించారు. కీలక చారిత్రక మైలురాళ్లు 1978 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి చట్టబద్ధం కాని బహుళ సభ్యుల కమిషన్. 1987లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్‌గా పేరు మార్చబడింది.1990 సంవత్సరం 65వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చట్టబద్ధమైన హోదా ఇవ్వబడింది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 338 ప్రకారం షెడ్యూల్ కులములు ,ఆర్టికల్ 338 (ఏ )ప్రకారం షెడ్యూలు తెగలకు కమిషన్ విడివిడిగా ఏర్పాటు చేయబడినది. 1992లో మొదటి అధికారిక శాసనబద్ధ కమిషన్ మార్చి 12, 1992న ఏర్పాటు చేయబడింది. 2004 లో ఫిబ్రవరి 19, 2004న ప్రత్యేక జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (NCSC), జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (NCST)గా విభజించబడింది. భారతదేశంలో సుమారు 10.4 (104 మిలియన్లు)కోట్ల మంది గిరిజన జనాభా ఉన్నారు. ఇది దేశ మొత్తం జనాభాలో 8.6 శాతం. అధికారిక రికార్డుల ప్రకారం 705కు పైగా విభిన్న గిరిజన తెగలు షెడ్యూల్డ్ తెగలుగా జాబితా చేయబడ్డాయి. ప్రతి గిరిజన తెగ వారి ప్రత్యేక భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలు కలిగి ఉన్నాయి. మనదేశంలో మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో అత్యధిక సంఖ్యలో గిరిజనులు ఉండగా, మిజోరం, లక్షద్వీప్‌లలో అత్యధిక శాతం వాటాలు ఉన్నాయి.

**కీలక వాస్తవాలు, సంఖ్యలు మొత్తం జనాభా:** ఈ విధంగా ఉన్నాయి.సుమారు 10.42 కోట్లు (104 మిలియన్ల) మంది.

**మొత్తం జనాభాలో గిరిజనుల వాటా:** 8.6%, గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 9.38 కోట్ల మంది గిరిజనులు నివసిస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో 1.05 కోట్ల మంది నివసిస్తున్నారు. రాష్ట్రాల వారీగా అత్యధిక గిరిజన జనాభా కలిగినది మధ్యప్రదేశ్, ఆ తర్వాత మహారాష్ట్ర, ఒడిశా. స్థానిక జనాభా అత్యధిక శాతం మిజోరం రాష్ట్రంలో ఉన్నారు. (సుమారు 94%), లక్షద్వీప్ (సుమారు 94%). ప్రధాన గిరిజన ప్రాంతంగా ఉంటుంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుండి జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ వరకు విస్తరించి ఉన్న మధ్య భారతదేశం, గిరిజన జనాభాలో అధిక భాగాన్ని కలిగి ఉంది. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాల ప్రకారం , రాష్ట్ర విభజన అనంతరం, జనాభా లెక్కల కొలమానాలకు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం షెడ్యూల్డ్ ట్రైబ్ (ST) గిరిజన జనాభా సుమారుగా 26.31 లక్షలు (2,631,145) ఉంది, ఇది రాష్ట్ర మొత్తం జనాభాలోదాదాపు 5.3% గా ఉంది. అల్లూరి సీతారామ రాజు (విశాఖపట్నం ప్రాంతం), పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం వంటి తూర్పు కనుమల వెంట ఉన్న జిల్లాల్లో అత్యధిక గిరిజన సాంద్రతలు కనిపిస్తాయి. ఈ రాష్ట్రంలో చెంచు, కొండారెడ్డి, సవరాల, జాతాబు, యానాది, కోయ, కొండరెడ్లు, లంబాడా, బంజారా, వంటి ప్రత్యేకంగా బలహీనమైన గిరిజన సమూహాలతో (PVTGలు) సహా సుమారు 34 విభిన్న గిరిజన వర్గాలు నివసిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం అధికారికంగా 32 షెడ్యూల్డ్ తెగలను (STలను)గుర్తించింది. వీటిలో జనాభా పరంగా లంబాడా (బంజారా) అతిపెద్ద సమూహంగా ఉంది. రాష్ట్రంలోని గిరిజన జనాభాలో గోండ్, కోయ వంటి ప్రధాన సమూహాలతో పాటు, ప్రత్యేక అభివృద్ధి మద్దతు అవసరమయ్యే బలహీన వర్గాలు కూడా ఉన్నాయి. ప్రధాన, ప్రముఖ తెగలు..

**లంబాడా / బంజారా / సుగాలీలు:** రాష్ట్రంలో వీరు అత్యధిక జనాభా కలిగిన గిరిజన సమూహం, వివిధ జిల్లాల్లో విస్తృతంగా విస్తరించి ఉన్నారు.

**గోండ్ (రాజ్‌గోండ్, కోయిటూర్):** గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన మధ్య భారతదేశంలోని ఒక ప్రధాన గిరిజన తెగ. వీరు ప్రధానంగా ఉత్తర జిల్లాలలో కేంద్రీకృతమై ఉన్నారు.

**కోయ:** ప్రధానంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతం మరియు తూర్పు ప్రాంతాలలో నివసించే ఒక ప్రముఖ అటవీ గిరిజన తెగ.

**కొలాం:** ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల్లో ప్రధానంగా కేంద్రీకృతమై ఉన్న ఆదిమ సమాజం.

రాష్ట్రం 32 విభిన్న షెడ్యూల్ తెగలను గుర్తిస్తుంది, వీటికి మాత్రమే పరిమితం కాకుండా: ఆంధ్, బగత, భిల్, చెంచు (ఒక PVTG), గడబాస్, గోండ్, గౌడు, కొండ రెడ్డిలు, జటాపులు, కమ్మర, కట్టునాయకన్, కోలం, కొండ ధోరాలు, కొండ కాపులు, కొండారెడ్డి, కొండరెడ్డి, కొండారెడ్డి, కొండరెడ్డి, ధోర, ముఖ ధోర, నాయకులు, పర్ధన్, పోర్జా, రెడ్డి ధోరాలు, రోనా, సవరాలు, సుగాలీలు (లంబాడా/బంజారా), తోటి, యెనాడిలు, యెరుకులాలు మరియు నక్కలా. ఇటీవల కాలంలో గిరిజనులపై దాడులు తీవ్ర రూపం దాల్చాయి. సభ్య సమాజం తలదించుకునే విధంగా అమానుషమైన రీతిలో జరుగుతున్నాయి. నక్సలైట్ల పేరుతో తీవ్రవాదుల పేరుతో, మావోయిస్టుల పేరుతో వారి పై నరమేధం జరుపుతున్నారు . గిరిజన నాయకుడు హిడ్మాను, అతని తల్లిని అతని ఇంటిని సోషల్ మీడియాలో చూసిన వారు ఎవరైనా గిరిజన హక్కులకు పోరాడే వారి పట్ల ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో మనకు అర్థం కాక మానదు. అటవీ సంపదను అంబానీ ఆదాని ఆశితపక్షపాతులకు అప్పజెప్పటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల పై నరమేధం జరుపుతున్నారు. అడవులను అడవుల్లో ఉన్న మనుషులను రక్షించుకోవాల్సిన బాధ్యత నాగరికుల అందరిపై ఉన్నది.

## చాలా తేడా ఉంటుది

ఓరియెంటేషన్ నుంచి స్నాతకోత్సవం వరకు ఈ ప్రయాణాన్ని పూర్తి చేసినందుకు ఈ రోజు వారు అపారమైన సంతృప్తిని పొందుతారని ప్రధాని అన్నారు. విద్యార్థులు కేవలం డిగ్రీలు మాత్రమే సంపాదించడం లేదని, దేశానికి గొప్ప సేవ చేయాలనే కలలతో ఐఐటి ఢిల్లీ నుంచి బయటకు వస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. విద్యార్థులందరినీ వారి కొత్త ప్రయాణానికి ఆయన అభినందించారు. ప్రతి విద్యార్థికి రేపటిపై ఒక విభిన్నమైన దృక్పథం ఉంటుందని ప్రధానమంత్రి అన్నారు. ప్రతి ఒక్కరి మార్గం భిన్నంగా ఉంటుందని, ప్రతి ఒక్కరి కల కూడా భిన్నంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కలలు విభిన్నమైనప్పటికీ, ఈ రోజు ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తుందని ఆయన చెప్పారు. ఐఐటి ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, "క్యాంపస్ జీవితానికి, క్యాంపస్ బయటి జీవితానికి చాలా తేడా ఉంది. ఐఐటి పరీక్షలకు సిలబస్ ఉంటుంది, కానీ జీవితమనే పరీక్షలో ప్రతీదీ సిలబస్‌కు అతీతంగా ఉంటుంది. జీవితం వేరే విధంగా సాగుతుంది. దానికి నిర్దిష్టమైన మార్గం గానీ, ప్రశ్నపత్రం గానీ ఉండదు. చాలాసార్లు, అసలు ప్రశ్న ఏంటో కూడా ఎవరూ చెప్పరు. ఆ ప్రశ్నను మీరే గుర్తించుకోవాలి" అని అన్నారు. ఐఐటి ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, "ఈరోజు ఐఐటి ఢిల్లీలో ఏఐకి సంబంధించిన కొన్ని కొత్త కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి. దీనికి కూడా మీ అందరికీ నా శుభాకాంక్షలు" అని అన్నారు. చాలా మంది విద్యార్థులు తమ మొదటి జీతం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. "ఈరోజు మీరందరూ ఇక్కడ ఉన్నారు, కానీ మీ మనసులోని ఏదో ఒక మూల ఇంకేదో ఆలోచన ఉండాలి. ప్రతి విద్యార్థికి రేపటి గురించి తనదైన ఒక ఆలోచన ఉంటుంది. చాలా మంది విద్యార్థులు తమ మొదటి జీతం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. కొందరు కొత్త నగరంలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతూ ఉంటారు. చాలా మంది స్నేహితులు తమ మొదటి స్టార్టప్ గురించి కలలు కంటూఉంటారు. ప్రతి ఒక్కరి మార్గం భిన్నంగా ఉంటుంది. ప్రతి ఒక్కరి కల భిన్నంగా ఉంటుంది, కానీ ఇవన్నీ ఉన్నప్పటికీ, మీ అందరిలో ఉమ్మడిగా ఉండే ఒక భావన ఉంటుంది."

## ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి

టీచర్లే ఇవాళ గొడ్డలి పార్టీ తీరును తప్పు పడుతూ ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం చేసే మంచిని ప్రజలకు వివరించగలిగితే... గొడ్డలి పార్టీ కుట్రలను ప్రజలే అడ్డుకుంటారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనే దానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే నిదర్శనం.

పారదర్శకంగా వ్యవహరించి.. వాస్తవాలు చెబితే... ప్రజలే కుట్రలను చేధిస్తారనడానికి కర్నూల్లో గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా టీచర్ల ఆందోళనే ఉదాహరణ. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానుని అన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులున్నా... వ్యవస్థలను గాడిలో పెట్టి సంక్షేమంఅభివృద్ధి చేస్తున్నాం. సాధారణ కార్యకర్తకైనా... పార్టీ అగ్ర నాయకుడికైనా పార్టీనే సుప్రీం. ఏయే నియోజకవర్గాల్లో ఏమేం జరుగుతున్నాయోననే అంశాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నాను. కార్యకర్తలను పట్టించుకోని వారిని... పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో జీరో టాలరెన్స్. గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదు. ఏ ఎన్నికలు జరిగినా... ప్రతి బూత్ లోనూ గడచిన ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువే రావాలి. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై చాలా ప్రభావం చూపుతుంది.యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లు, మండల అధ్యక్షులకు గౌరవం దక్కేలా చేస్తామని అన్నారు

# యాదగిరిగుట్టలో పెరిగిన భక్తుల రద్దీ

- శ్రీలక్ష్మీ నరసింహ స్వామి నిత్యరాబడి రూ.22.23 లక్షలు


**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 08 :**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. రెండో శనివారం కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు తరలి వస్తున్నారు. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్య నారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి శనివారం నిత్య రాబడిలో భాగంగా రూ.22,23,367 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,55,850, బ్రేక్ దర్శనం ద్వారా రూ.2,34,300, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.60,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.2,94,150, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.4,19,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.66,916, ప్రసాద విక్రయం ద్వారా రూ.7,30,660, కల్యాణకట్ట ద్వారా రూ.35,000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



## ఘనంగా కల్లూరి రామ చంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 08 :**

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఆలేరు నియోజకవర్గం నేత కల్లూరి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన అభిమానులు కేకును ఏర్పాటు చేశారు. అక్కడికి చేరుకున్న కల్లూరి రామచంద్ర రెడ్డి కేకును కట్ చేసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. అంతకుముందు ఆయన నాయకులు,కార్యకర్తలతో కలిసి యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్లూరి రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గం ప్రజల సేవకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు. వర్షాలతో ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని వేడుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఆయన వెంట మైలారిగూడెం గ్రామ సర్పంచ్ మారెడ్డి కొండల్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నేతలు కర్రె వెంకటయ్య, పాపట్ల నరహరి, సయ్యద్ బాబా, మాటూరి బాలయ్య గౌడ్, రాచకొండ శ్రీనివాస్, సతీష్ బట్ల్, కొన్యాల నర్సింహ రెడ్డి, యాకుబ్, పశురాములు, అంకం నరసింహ, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## ఏకగ్రీవ తీర్మానం

నిలబెట్టుకుంటూ కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ వంటి మిత్రపక్షాలతో పాటు సీపీఐ, సీపీఎం ప్రతినిధులు పాల్గొని నియోజకవర్గాల పెంపు యత్నాలను తీవ్రంగా నిరసిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత కార్తి చిదంబరం మీడియాతో మాట్లాడుతూ తమ నిర్ణయాన్ని స్పష్టంగా వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను అలాగే కొనసాగించాలని, దక్షిణాది ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా ఉన్న ఏ నియోజకవర్గాల సవరణ ప్రక్రియను అంగీకరించబోమని తేల్చిచెప్పారు. ముఖ్యంగా తమిళనాడుకు కేటాయించిన ఎంపీ స్థానాల్లో ఎలాంటి కోత లేదా అసమాన మార్పులు ఉండకూడదని స్పష్టం చేశారు. విజయ్ నేతృత్వంలో జరిగిన ఈ చర్చల్లో పీ. చిదంబరం, తొల్ తిరుమావలవన్, సు వెంకటేశన్, దురై వైకో వంటి అగ్రనేతలు పాల్గొని కేంద్ర వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

**డీఎంకే, ఏఐఏడీఎంకే బహిష్కరణ...**

మరొకవైపు, తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్షాలు అయిన డీఎంకే, ఏఐఏడీఎంకే ఈ ఎంపీల సమావేశాన్ని పూర్తిగా బహిష్కరించాయి. ఈ భేటీని ఒక "చౌకబారు నాటకం" అని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే విజయ్ ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసిందని డీఎంకే సీనియర్ నేత ఏ రాజా ఎద్దేవా చేశారు. అసలు పార్లమెంట్‌లో ఇంకా ఎలాంటి అధికారిక బిల్లు ప్రవేశపెట్టకుండా, దానిపై సమగ్ర అవగాహన కూడా లేకుండా ఇలాంటి భేటీలు పెట్టడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. డీఎంకే మిత్రపక్షాలైన ఎంఎన్ఎమ్, డీఎండీకే కూడా ఈ భేటీకి దూరంగా ఉన్నాయి.

**కావేరీ అంశంపై మౌనం... బిల్లుపై వేగం ఏంటి?**

విజయ్ సర్కార్ తీరుపై ఏఐఏడీఎంకే ఘాటుగా స్పందించింది. కళ్లముందే ఉధృతంగా నడుస్తున్న కావేరి మేకేదాటు వివాదంపై ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరినా పట్టించుకోని ముఖ్యమంత్రి విజయ్, అసలు ఉనికిలోనే లేని డిలిమిటేషన్ బిల్లుపై అత్యవసరంగా ఈ సమావేశం ఎందుకు నిర్వహించారో చెప్పాలని నిలదీసింది. పార్లమెంట్‌లో ఎటువంటి బిల్లు తీసుకరాకుండానే అటు ఎంపీలకు లేఖలు పంపి ఇలా ప్రచార ఆర్భాటం చేయడం తొందరపాటు చర్య అని ఏఐఏడీఎంకే ధ్వజమెత్తింది. ఏది ఏమైనా విజయ్ సర్కార్ వేసిన ఈ డిలిమిటేషన్ అడుగు, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త రచ్చకు తెరలేపింది.

## భవనం పై జారిపడి కార్మికుడు మృతి



**జయభేరి, ఘట్కేసర్, ఆగస్టు 8 :**

మేడ్చల్ జిల్లా పోచారం జోడిమెట్ల హరి హర కన్స్ట్రక్షన్ లో విషాదం జరిగింది మధ్యప్రదేశ్ కు చెందిన వినోద్ కుమార్(37) భవన కార్మికుడు 15వ అంతస్తులో పెయింట్ వేస్తుండగా భవనం పైనుంచి ప్రమాదవశాత్తు శనివారం కిందపడి మృతి చెందాడు తోటి భవన కార్మికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోచారం ఐటీ కారిడాల్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# ఆటో సంక్షేమ బోర్డును వెంటనే అమలు చేయాలి

- మహబూబ్ నగర్ జిల్లా ఆటో యూనియన్ (జెఎసి) జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రాము
- దేవరకద్రలో ఆటో యూనియన్ సమావేశం

**జయభేరి, దేవరకద్ర :**



కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా ఆటో సంక్షేమ బోర్డును తక్షణమే ముఖ్యమంత్రి అమలు చేయాలని పాలమూరు జిల్లా ఆటో యూనియన్ (జేఏసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రాము కోరారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శనివారం 23 గ్రామాల ఆటో యూనియన్ ఇన్చార్జ్ లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కే.రాము ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ప్రవేశపెట్టిన ఆర్టీసీ ఆటో అనే కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లను మభ్యపెట్టే ఇలాంటి కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమన్నారు. దేవరకద్ర నియోజకవర్గం ఆటో యూనియన్ ఉపాధ్యక్షుడు జోగి గోవిందు మాట్లాడుతూ ఆటోల డాక్యుమెంట్స్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్, లైసెన్స్ కల్గి ఉన్న ప్రతి డ్రైవర్లు మాత్రమే ఆటోలు నడపాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి కోట్ల రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన నిర్వహించే ఆటో యూనియన్ సంపూర్ణ బందుకు మద్దతు ఇస్తున్నామన్నారు. అందరు కూడా దీనికి మద్దతు ఇవ్వాలని పిలుపు ఇచ్చారు. దేవరకద్ర నియోజకవర్గ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన ఆటో యూనియన్ పట్టణ కమిటీని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆటో యూనియన్ ఇంచార్జ్ లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీల సంక్షేమం పార్టీ బలోపేతంపై సమావేశం

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 8 :**



మినిస్టర్ క్వార్టర్స్‌లోని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో నిర్వహించిన సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. బీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతి, బీసీల ఆర్థిక అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలు, ఆత్మగౌరవ భవనాల నిర్మాణాల పూర్తి తదితర అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ జూమ్ ద్వారా సమావేశానికి హాజరయ్యారు. హైదరాబాద్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ సమీపంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలతో పాటు ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలను ప్రారంభించేందుకు తేదీలను ఖరారు చేసే అంశంపై సమావేశంలో చర్చించారు.

బీసీ మహనీయుల విగ్రహాల ఏర్పాటు ద్వారా వారి సామాజిక సేవ, సమాజ అభ్యున్నతికి చేసిన కృషి, బడుగు బలహీన వర్గాల కోసం వారు సాగించిన పోరాటాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించే అంశంపై సమావేశంలో చర్చ జరిగింది. బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయి, పథకాల ప్రయోజనాలు ప్రతి లబ్ధిదారునికి చేరేలా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సమీక్షించారు.

ఈ సమావేశంలో బీసీ మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, బీసీ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, వి. హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల సమస్యలు తీర్చాలని ఎమ్మెల్యే వినతి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**



రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని శనివారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కలిశారు. హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఎమ్మెల్యే జిఎంఆర్ కలిసి నియోజకవర్గం ఇండ్ల L3 సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి సంబంధించిన ఫైనల్ రిపోర్ట్ ఇప్పటికే ప్రభుత్వానికి అందజేయడం జరిగిందని, త్వరగా ఆ కార్యాలయాన్ని దేవరకద్రలో ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కూడా మంత్రిని ఎమ్మెల్యే జీఎంఆర్ కోరారు. దీనికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- రూ.2 లక్షల విలువైన సామగ్రి దగ్ధం



**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 08 :**

యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని పాతగుట్ట సమీపంలో అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపల్లి నర్సింహ్మా అనే వ్యక్తికి చెందిన దుకాణంలో షార్ట్ సర్క్యూట్ తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. ప్రమాదం సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందని తెలిపారు. ప్రమాదంలో దుకాణంలోని సామగ్రి పూర్తిగా కాలిపోయిందని,సుమారు రూ. 2 లక్షల మేర నష్టం జరిగినట్టు యజమాని గుండ్లపల్లి నర్సింహ్మా తెలిపారు.


## ఏఈవో శ్రవణ్‌కు హైకోర్టు ఆర్డర్ అమలు చేయాలని వినతిపత్రం



**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 08 :**

యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘం పేరుతో కొనసాగుతున్న దుకాణాలపై హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను వెంటనే అమలు చేయాలని యాదాద్రి పరిరక్షణ సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం యాదగిరిగుట్ట ఆలయ ఏఈవో శ్రవణ్‌కు హైకోర్టు ఆర్డర్ అమలు చేయాలని వినతిపత్రం అందజేసి మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వులు అమలులో ఉన్న నేపథ్యంలో వర్తక సంఘం పేరుతో కొనసాగుతున్న దుకాణాల్లో వ్యాపార కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని, కోర్టు ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుగ్గ ఆంజనేయులు,కాటబత్తిని ఆంజనేయులు,కర్రె ప్రవీణ్, బండి అనిల్,పల్లపు బాలయ్య,దండబోయిన వీరేష్,మాటూరి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జిఎంఆర్ కుమారుడి జన్మదిన వేడుకలు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కుమారుడు వినయ్ ప్రణీత్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులతో కలిసి వినయ్ ప్రణీత్ కుమార్ రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం తమ కుమారుడికి కేక్ తినిపించి ఎమ్మెల్యే దంపతులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# రెండేళ్ల కష్టం.. భవిష్యత్తు ఉజ్వలం

- మేడ్చల్ జోన్ ఏసీపీ సిహెచ్. శంకర్ రెడ్డి
- స్ఫూర్తి జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**జయభేరి, మేడ్చల్:**

జీవితంలో పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని మేడ్చల్ జోన్ ఏసీపీ సిహెచ్. శంకర్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థులు రెండేళ్ల పాటు కష్టపడి చదివితే ఉజ్వలమైన భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని సూచించారు. మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం శ్రీ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేడ్చల్ జోన్ ఏసీపీ సిహెచ్. శంకర్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర కృషి ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్నారు. విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైనదని, ఈ దశలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థులు రాబోయే రెండేళ్లను ఎంతో విలువైన సమయంగా భావించి, చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించి క్రమబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడమే కాకుండా ఆ లక్ష్యాన్ని చేరుకునే వరకు పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, మంచి నడవడి అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రులు, అధ్యాపకుల సూచనలు పాటించాలని చెప్పారు. విద్యార్థులు ఎదురయ్యే చిన్నచిన్న అపజయాలకు నిరుత్సాహపడకుండా వాటిని అనుభవాలుగా తీసుకుని మరింత కష్టపడాలని అన్నారు. ఈ రెండేళ్లలో పెట్టే కష్టం, భవిష్యత్తులో ఉన్నతమైన జీవితానికి బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, తనకు నచ్చిన రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు, కళాశాల పేరు నిలబెట్టేలా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఏసీపీ శంకర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎస్ఐ భానుచందర్ గౌడ్, కళాశాల యాజమాన్య సభ్యులు మంజుల ప్రకాష్, కమలాకర్ రెడ్డి, దేవరాజ్, గణేష్, రామ్ శంకర్, సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





**చదువుతో పాటు విలువలు నేర్చుకోవాలి: - మంజులాదేవి**

గౌరవ అతిథిగా పాల్గొన్న సామాజికవేత్త మంజులాదేవి మాట్లాడుతూ విద్యార్థి దశలో తల్లిదండ్రులు, గురువులు అందించే సూచనలు, సలహాలను శ్రద్ధగా పాటిస్తూ మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆమె అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకుని, చదువుతో పాటు మంచి విలువలు, సంస్కారం, బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించుకోవాలని మంజులాదేవి సూచించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ రెండేళ్లు ఎంతో కీలకమైనవని, భవిష్యత్తులో ఎలాంటి మార్గాన్ని ఎంచుకోవాలో నిర్ణయించుకునే ముఖ్యమైన దశ ఇదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం పెట్టే శ్రమ, భవిష్యత్తులో సాధించే విజయానికి పునాదిగా నిలుస్తుందని, విద్యార్థులు తమపై నమ్మకం ఉంచుకుని, లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా నిరంతరం కృషి చేయాలని సూచించారు. చదువుతో పాటు తల్లిదండ్రులను గౌరవించడం, గురువుల పట్ల విధేయత కలిగి ఉండటం, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించడం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని మంజులాదేవి తెలిపారు. విద్యార్థులు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ, అపజయాలను చూసి వెనుకడుగు వేయకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, తల్లిదండ్రులు, కళాశాల, సమాజానికి గర్వకారణంగా నిలిచేలా ఎదగాలని ఆమె సూచించారు.



## పరవాడ ఎస్సీ వీధిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

- అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం, పరవాడ గ్రామం:
పరవాడ గ్రామంలోని ఎస్సీ వీధిలో గత కొంతకాలంగా వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఐదు రోజుల క్రితమే గ్రామ సెక్రటరీ ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో చీకటి కారణంగా రాత్రి సమయంలో ప్రజలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఎస్సీ వీధిలో పనిచేయని వీధి దీపాలను మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మేడ్చల్ డివిజన్ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్



**జయభేరి, మేడ్చల్:**

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మేడ్చల్ డివిజన్ ప్రజలకు నల్లపోచమ్మ తల్లి, దుర్గమ్మ తల్లి బోనాల పండుగ శుభాకాంక్షలను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అమ్మవార్ల ఆశీస్సులతో మేడ్చల్ డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. డివిజన్ ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, పుర ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

- ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా అధ్యక్షులు బండారు సుధాకర్
- భక్తులకు అన్నదాన కార్యక్రమం



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాదు రోడ్డులో గల ప్రముఖ శ్రీ పద్మావతి గోదా వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. దివంగత స్వర్గీయులు కుంభం పుల్లారెడ్డి సుజాతమ్మ దంపతులు నిర్మించిన అపురూపమైన పుణ్యక్షేత్రం అర్ధగిరి క్షేత్రం. ఈ క్షేత్రాన్ని వారి తనయుడు కుంభం మనోహర్ రెడ్డి ఇన్ని రోజులుగా నిర్వహణ చూసుకున్నారు. ప్రస్తుతం నూతన కమిటీ ఆలయ అభివృద్ధికి తోడ్పడేటట్లు తీర్మానాలు చేశారు. ఆలయ నూతన ట్రస్ట్ కమిటీ శాశ్వత ధర్మకర్త గౌరవ అధ్యక్షులుగా కుంభం మనోహర్ రెడ్డి, అధ్యక్షులుగా బండారు సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా మారం భాస్కర్ రెడ్డి, కోశాధికారిగా పంపాటి శ్రీధర్, ఉపాధ్యక్షులుగ వేమన్ రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, ఏరుకొండ రాము తో పాటు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పసునూరు యుగంధర్ రెడ్డి, చిత్తరంజన్ రెడ్డి న్యాయం సుభాష్ రెడ్డి కేసాను లింగారెడ్డి తో పాటు పలువురు పెద్దలు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎల్లంపేట్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- చైర్ పర్సన్ శ్రీదేవి
- రూ.10 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**జయభేరి, మేడ్చల్:**



ఎల్లంపేట్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే పాలకవర్గం ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్ తెలిపారు. శనివారం ఎల్లంపేట్ పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డు సైదోనిగడ్డ తాండా వార్డులో సుమారు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్ స్థానిక కౌన్సిలర్ మలోత్ రజిత రాజేందర్ నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీదేవి రమేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు పారిశుద్ధ్యం, తాగునీరు, అంతర్గత రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మరింత వేగంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామని చైర్‌పర్సన్ తెలిపారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి ప్రతి వార్డును సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు మలోత్ రజిత రాజేందర్ నాయక్, వరలక్ష్మి సురేందర్, అర్చన శ్రీనివాస్, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## రాంనగర్ బాలాంజనేయ స్వామికి పూజలు


**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ సమీపంలోనున్న రాంనగర్ లో కొలువుదీరిన బాలాంజనేయ స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం పురోహితుడు రాజమూరి హన్మేష్ చారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో స్వామి వారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తరించారు.

## ఇళ్ల మధ్య గేదెల పెంపకం వద్దు

- మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక
- గేదెల యజమానులు జాగ్రత్త నివాస ప్రాంతాల్లో పెంపకం నిషేధం

**జయభేరి, దేవరకొండ :**



నివాస ప్రాంతాల్లో గేదెల పెంపకం విరుద్ధమని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ రామ దుర్గా రెడ్డి తెలిపారు. శనివారం ప్రజా ఆరోగ్యం & పారిశుధ్య విభాగం లో భాగంగా ఓ ప్రకటన విడుదల చేశారు. మున్సిపాలిటీ పరిధిలో కొంతమంది గేదెల యజమానులు ఇళ్ల మధ్య, నివాస ప్రాంతాల్లో గేదెలను పెంచడం వలన పేడ, మూత్రం, దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు పెరిగి ప్రజలకు అసౌకర్యం మరియు ప్రజారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు. కావున మున్సిపాలిటీ పరిధిలోని గేదెల యజమానులు తప్పనిసరిగా క్రింది సూచనలు పాటించాలని అన్నారు. 1. ఇళ్ల మధ్య, నివాస ప్రాంతాల్లో గేదెలను ఉంచరాదు. 2. గేదెల పేడ, వ్యర్థాలను రోడ్లపై, డ్రైనేజీల్లో వేయరాదు. 3. గేదెల కొట్టాలను పరిశుభ్రంగా ఉంచాలి. 4. పేడ, మూత్రం వల్ల దుర్వాసన మరియు దోమలు, ఈగలు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. 5. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లపై గేదెలను వదలరాదు. 6. మున్సిపల్ సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలి. పై సూచనలు పాటించని యజమానులపై మున్సిపల్ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోబడతాయి. ప్రజారోగ్యం, పట్టణ పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీకి సహకరించాలని తెలిపారు. నివాస ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యానికి, పారిశుద్ధ్యానికి ఇబ్బందులు కలిగించే విధంగా పశువులను పెంచకుండా మున్సిపల్ నిబంధనలను పాటించాలని కమిషనర్ కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

## ప్రజా సేవ కోసమే.. రాజకీయాల్లోకి..

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం




**జయభేరి, దేవరకద్ర :**

ప్రజాసేవ తలంపుతోనే రాజకీయాల్లోకి రావడం జరిగిందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) స్పష్టం చేశారు. లాభా పేక్షతో ఎట్టి పరిస్థితుల్లో రాజకీయాల్లోకి తాను రాలేదన్నారు. ఒకవేళ లాభాపేక్ష కావాలనుకుంటే తన వృత్తి తనకు ఉందన్నారు. లాబాపేక్షే కావాలనుకుంటే ఇవన్నీ వదులుకొని హైదరాబాద్ లో హాయిగా ఉండేవాడ్ని అని అన్నారు. కానీ నేను అలా చేయడం లేదన్నారు. నా ప్రాంత ప్రజలకు అండగా నిలవాలని అనుకుంటున్నాను. దీనికి అందరూ సహకరిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. దీనికి ప్రజా సహకారం చాలా అవసరం అన్నారు. ప్రజాసేవ చేసి ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావాలన్నా ప్రధాన ఉద్దేశంతోనే తాను రాజకీయాల్లోకి అడుగుపెట్టడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు.

## 15 ఏళ్లుగా రోడ్డు లేదు.. నీళ్లూ లేవు!

- పన్నులు వసూలు చేస్తూ కనీస వసతులు కల్పించరా? – ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆగ్రహం

**జయభేరి, ఘట్కేసర్ :**



మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోచారం డివిజన్ చౌదరిగుడా గ్రామం శ్రీరామాలయం కాలనీలో నెలకొన్న రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను మేడ్చల్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. కాలనీ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డితో కలిసి కాలనీలో పర్యటించి స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఏనుగు సుదర్శన్ రెడ్డి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి కనీస మౌలిక వసతులు వెంటనే కల్పించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీరామాలయం కాలనీ ఏర్పడి దాదాపు 15 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క సీసీ రోడ్డు కూడా వేయకపోవడం ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కాలనీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజల నుంచి మాత్రం క్రమం తప్పకుండా పన్నులు వసూలు చేస్తూ, అదే ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించకపోవడం ఏ విధమైన పాలన అని ప్రశ్నించారు. పన్నులు కట్టే ప్రజలకు రోడ్డు, నీరు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

# అక్రమ మైనింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ప్రజా సంఘాలు

జయభేరి, పరవాడ:



పరవాడ మండలంలో దేశపత్రినిపాలెం రెవెన్యూ లో 334 సర్వే నెంబర్లు దేవి కొండను అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. విలువైన ఎర్రమట్టను 50 కోట్ల మేర అక్రమంగా తవ్వకాలు చేస్తుంటే మైనింగ్ రెవెన్యూ పోలీస్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని వెంటనే చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ, సిపిఎం జిల్లా నాయకులు దేశపాత్రునిపాలెం మాజీ ఉప సర్పంచ్ వివి రమణ అన్నారు. శనివారం అక్రమ మైనింగ్ చేస్తున్న క్వారీను పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పర్యావరణ నాశనం చేసి 50 కోట్లు విలువైన ఎర్రమట్టిను తరలించికుపోయిన నేరస్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుటమి నేతలు అండతో ఈ తవ్వకాలు సాగుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. వెంటనే సమగ్ర విచారణ చేసి బరితెగించి తవ్వకాలు సాగిస్తున్న మట్టి మాఫియా పై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కొండ ఫార్మా కాలుష్యం నుండి దేశపత్రినిపాలెం గ్రామానికి రక్షణ గోడగా ఉందని భవిష్యత్తులో ఈ కొండ నాశనం అయితే తీవ్రమైన కాలుష్యం ప్రజల అనుభవించవలసిన పరిస్థితి ఏర్పడతాయని అన్నారు. మైనింగ్,రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు నిర్వహించి మైనింగ్ మాఫియా పై చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. మైనింగ్ చెక్పోస్టులు ఏర్పాటు చేశామని గొప్పగా చెబుతున్న ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం మరి ఈ చెక్పోస్టుల ద్వారా ఎందుకు ఇంత మట్టి తవ్వకాలు సాగిస్తే ఎందుకు పట్టుకోలేకపోయారని అన్నారు. అంటే ప్రభుత్వం చెక్ పోస్ట్ లో ఉన్నవారు ఈ మట్టి మాఫియా గ్యాంగ్ కి అండగా నిలిచారా అనే కోణంలో కూడా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ కొండ మట్టి తవ్వకాలు సాగించడానికి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారని ప్రజలు దీన్ని ముక్తకంఠంతో ఖండించారని గుర్తు చేశారు.దీనిపై జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదుచేస్తున్నట్లు సిఐటియు, సిపిఎం నేతలు తెలిపారు.



## మిస్సింగ్ కేసు.. ఆత్మహత్య

జయభేరి, మేడిపల్లి :

మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారు అంబటి సైదమ్మ (47), కులం గౌడ్, చెంగిచెర్ల. ఆమె భర్త అంబటి రమేష్(47), వృత్తి ప్రైవేట్ ఉద్యోగి, తేదీ 06 రాత్రి సుమారు 08:00 గంటలకు ఎవరికీ చెప్పకుండా తన కార్ నంబర్ TS07 HB 6516లో ఇంటి నుండి వెళ్లిపోయినాడు. అదే రోజు రాత్రి 11.00 గంటల సమయంలో తన పెద్ద కుమార్తెకు ఫోన్ చేసి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవించాలనే ఆసక్తి లేదని తెలిపినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులు తేదీ 08 ఉదయం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా తేదీ 08 మధ్యాహ్నం సుమారు 12:00 గంటల సమయంలో చెర్లపల్లి వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో ఒక కారులో గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి మిస్సింగ్ అయిన అంబటి రమేష్‌గా గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, అతడిని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించడం జరిగింది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, రమేష్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా గుర్తుతెలియని విషపదార్థం సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానించబడుతోంది. ఈ ఘటనకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.



## నేడు కొన్నూరులో ఎంపీ డీకే. అరుణమ్మ చెక్కుల పంపిణీ

జయభేరి, దేవరకద్ర :

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని దేవరకద్ర నియోజకవర్గం మదనాపురం మండలం కొన్నూరులో ఆదివారం ఎంపీ డీకే. అరుణమ్మ రైతులకు చెక్కులను పంపిణీ చేయనున్నట్లు దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా మదనాపురం మండలం కొన్నూర్ పంచాయతీ దగ్గర రైల్వే లైన్ కారణంగా భూమిని కోల్పోయిన రైతులకు ఈ పరిహారపు చెక్కులను ఎంపీ చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిలతోపాటు కొత్తకోట మండలం, కొత్తకోట పట్టణం మరియు మదనాపురం మండలానికి చెందిన పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు, ప్రధాధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కొండ ప్రశాంత్ రెడ్డి కోరారు.

# ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు

- సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన ఆదివాసీ దినోత్సవ వేడుకలు
- తెలంగాణ గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో ఆదివాసి దినోత్సవ వేడుకలు

జయభేరి, దేవరకొండ :



ఆదివాసీ సమాజ అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొంటూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలంగాణ గిరిజన మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హరిప్రియ తెలిపారు. ఈ సందర్బంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, గిరిజన సంక్షేమ సెక్రెటరీ కే సీతలక్ష్మి, డి ఎస్ వేణుగోపాల్, ఓఎస్ డిలు జిబి వెంకటేశం, రామారావు, సతీష్‌గౌడ్, నీరజా సిన్హా, నల్గొండ రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరాయ్, మైనంపల్లి సర్పంచ్ రామ్ సింగ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమావత్ రవి, రాష్ట్రవ్యాప్త గిరిజన కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నృత్య, గిరిజన పాత్ర కళా పోషణ షోకేస్, 11 రకాల గిరిజన పండుగల దేవాలయాలు, గిరిజనులకు సంబంధించిన నాలుగు రకాల స్టాల్స్ అవి గదా, కళా, స్వాద్, ఔషధ ప్రదర్శించచారు. ప్రదర్శనలో ప్రతి ఒక్క విద్యార్థి గిరిజనులకు సంబంధించిన హిస్టరీ, సాంస్కృతి సంప్రదాయాలు, ఆహార అలవాట్లు, ఔషధ మొక్కలు సేకరించి వాటిని క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వెన్నుముకగా ఉన్నటువంటి తిరుమల రావు తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్, ఏపి ఓ భాస్కర్ రావు అదిలాబాద్ సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమం ఆహ్లాదకరముగాను, కనులవిందుగాను ప్రదర్శించడం జరిగిందని మహిళ గిరిజన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హరిప్రియ, అధ్యాపక బృందం, విద్యార్థినీలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## మేడిపల్లిలో రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: ఇన్‌స్పెక్టర్ జలెందర్‌రెడ్డి



జయభేరి, మేడిపల్లి:

రాబోయే బోనాలు, వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణపై మేడిపల్లి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా రౌడీషీటర్లకు మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జలెందర్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు ఇకపై ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించడం, గొడవలకు పాల్పడటం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం వంటి వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ముఖ్యంగా బోనాలు, వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా, సురక్షితంగా పండుగలను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ జలెందర్‌రెడ్డి కోరారు.

## రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా దేవన్నసాగర్



జయభేరి, దేవరకద్ర :

తెలంగాణ రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రానికి చెందిన దేవన్నసాగర్ నియమితులయ్యారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవన్నసాగర్ మాట్లాడుతూ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు పాడుతానన్నారు. దీనికి ప్రతి ఒక్కరు తనకు సహకారం అందించాలని దేవన్నసాగర్ కోరారు.

# వైస్సార్సీపీ మూడవ రోజు రిలే నిరాహార దీక్ష

- రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు

జయభేరి, పరవాడ:



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న వైసీపీ రిలే నిరాహార దీక్షలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్,అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, నియోజకవర్గం రోలుగుంట గ్రామంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ మరియు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తోనూ నర్సీపట్నం నియోజకవర్గం, మాకవరపాలెం లో మూడవరోజు ఏపీ జెన్ జెడ్ వార్ రిలే నిరాహార దీక్షల్లో వారికీ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల నియోజకవర్గం పరిశీలకులు పైలా శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు.ఈ సందర్బంగా వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై విచారణ జరిపి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు.విద్యార్థులు, యువత, నిరుద్యోగుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని డీఎస్సీలో జరిగిన అవకతవకల పై సీబీఐ విచారణ జరపాలని,పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ భృతిని 3000 రూపాయలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎంపీపీలు జడ్పీటీసీలు ఎంపీటీసీలు యువజన,విద్యార్థి, సోషల్ మీడియా విభాగాల అధ్యక్షులు , మాజీ సర్పంచ్లు వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు రిలే నిరాహార దీక్షకు హాజరయ్యారు.

## పచ్చదనం కోసం ఎంపీకి ఉప్పల్ ఎమ్మెల్యే వినతిపత్రం

- మొక్కల సంరక్షణకు 30,000 ట్రీ గార్డులు అందించాలని ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న విస్తృత హరిత కార్యక్రమాల్లో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేందుకు 30,000 ట్రీ గార్డులు అవసరమని, ఇందుకు రూ.60 లక్షల CSR సహాయం అందించాలని కోరుతూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఇప్పటికే ECIL సంస్థకు CSR ద్వారా ట్రీ గార్డులు లేదా ఆర్థిక సహాయం అందించాలని ప్రతిపాదన సమర్పించగా, దానికి మద్దతుగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఎంపీకి ఈ వినతిపత్రం అందించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు అవసరమైన రక్షణ కల్పిస్తే నియోజకవర్గంలో పచ్చదనం మరింత పెరుగుతుందని, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పచ్చదనం పెంపు - పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు నాగారం బాబు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టికెట్ లేకుండా రిజర్వేషన్ కోచ్లోకి వెళ్తే రూ.2వేలు ఫైన్

రిజర్వేషన్ కోచ్లలోకి అక్రమ ప్రవేశాలను అరికట్టేందుకు దక్షిణ మధ్య రైల్వే కఠిన నిబంధనలు తెచ్చింది. సరైన టికెట్ లేకుండా రిజర్వ్డ్ కోచ్లోకి వెళ్తే రూ.2,000వరకు జరిమాన విధించనున్నట్లు ప్రకటించింది. రిజర్వ్ ప్రయాణికులను అడ్డుకుంటే రూ.1,000 జరిమానా విధిస్తామని తెలిపింది.జరిమానా చెల్లించకపోతే కోర్టు ద్వారా రూ.3,000వరకు ఫైన్ పడుతుందని హెచ్చరించింది. జనరల్ టికెట్లతో రిజర్వేషన్ కోచ్లోకి రావద్దని స్పష్టంచేసింది.

# అలరించిన గోరింటాకు సంబురాలు

- లయన్స్ క్లబ్ హైదరాబాద్ వారియర్స్ ప్రెసిడెంట్ లయన్ యనమల రాజు

జయభేరి, హైదరాబాద్ :





లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ వారియర్స్ నిర్వహించిన ఆషాడ మాసం గోరింటాకు సంబురాలు చూడ ముచ్చటగా జరిగాయి. బండ్లగూడ జాగీర్ లోని హైదర్షా కోట్ మాధవి నగర్ కాలనీ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ లయన్ కోటేశ్వరరావు, జీఈటీ యాదయ్య గౌడ్, లయన్స్ క్లబ్ హైదరాబాద్ వారియర్స్ ప్రెసిడెంట్ లయన్ యనమల రాజు, కాలనీ అధ్యక్షులు రాములు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యనమల రాజు మాట్లాడుతూ... ఆషాడం మాసం విశిష్టతను, ఉమ్మడి కుటుంబం అవసరం, నైతిక విలువల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే లయన్స్ క్లబ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. దావత్, పంక్షన్, పండుగల పేరిట అవసరానికి మించి చేసే అనవసర ఖర్చులను తగ్గించుకుంటేనే... ఆర్థికంగా బల పడుతామని పేర్కొన్నారు. వివిధ కాలనీల నుంచి వందలాది మహిళాలు అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో ఉత్సహంగా పాల్గొన్నారు. తెలంగాణా ఫోక్ సాంగ్స్కు దరువులకు, బోనాల సాంగ్స్ కు తమదైన రీతిలో డాన్స్ చేస్తూ ఎంజాయ్ చేశారు. అంతకు భక్తి శ్రద్దలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యనమల గ్రూప్స్ ఎండీ యనమల సిరి, వివిధ కాలనీల నాయకులు బాలేశ్వర్ రెడ్డి, రోజా, స్వప్న, సునీల్, దుర్గా భవాని పాల్గొన్నారు.





# కియారా వయ్యారం..

పాన్ ఇండియా స్టార్ హీరోలలో రాకింగ్ స్టార్ యశ్ ఒకరు. కేజీఎఫ్ 1, 2 సినిమాలతో ఓ రేంజ్‌లో సంచలనం సృష్టించిన యశ్, చాలా గ్యాప్ తర్వాత నటించిన లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'టాక్సిక్'. గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో KVN ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ భారీ ప్రాజెక్ట్ ఇప్పటికే విపరీతమైన హైక్ నెలకొంది. ముఖ్యంగా ఇటీవల విడుదలైన టీజర్ నెట్టింట ఏ స్థాయిలో సంచలనం క్రియేట్ చేసిందో చెప్పక్కర్లేదు. మరోవైపు మూవీ పై టీజర్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. తాజాగా ఈ మూవీ ట్రైలర్ శనివారం సాయంత్రం రిలీజ్ చేసింది చిత్రయూనిట్. ప్రస్తుతం తెలుగు ట్రైలర్ యూట్యూబ్‌లో విడుదలైన కొద్దిసేపట్లోనే సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ట్రైలర్ ఆద్యంతం అత్యంత డార్క్, విజువల్లీ రిచ్ అండ్ వయలెంట్ అట్మాస్ఫియర్‌తో సాగింది. "దిస్ వాస్ సపోజ్డ్ టు బి మై ఫెయిరీ టేల్" అనే ఇంట్రెస్టింగ్ డైలాగ్‌తో ప్రారంభమయ్యే ట్రైలర్ ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఈ సినిమాలో యష్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషీ, తారా సుతారియా ప్రధాన పాత్రల్లో అలరించనున్నారు. ప్రతి ఒక్కరి పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా, డిఫరెంట్ షేడ్స్‌తో ఉన్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అద్భుతమైన సినిమాటోగ్రఫీ సినిమా రేంజ్‌ను మరింత పెంచాయి. మొత్తానికి 'టాక్సిక్' ట్రైలర్ సినీ అభిమానులకు ఒక విజువల్ ట్రీట్‌గా నిలిచింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ముఖ్యంగా ఈ చిత్రంలో కియారా యాక్టింగ్, గ్లామరస్ లుక్స్ పీక్స్ లో ఉన్నాయని చెప్పొచ్చు. అలాగే లేడీ విలన్ డాన్‌గా నయనతార మాస్ హీరోయిన్‌గా కనిపించనుందని తెలుస్తోంది. ఈ సినిమాను ఆగస్ట్ 26న దాదాపు 40కు పైగా భాషలలో రిలీజ్ చేయనున్నారు.




# ఘాటుగా స్పందించిన హీరోయిన్!

## మృణాల్ ఠాకూర్-యశస్వి జైస్వాల్ డేటింగ్ రూమర్స్‌పై క్లారిటీ

బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి మృణాల్ ఠాకూర్ గురించి గత కొంతకాలంగా ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీమిండియా యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్‌తో ఆమె డేటింగ్‌లో ఉందంటూ నెట్టింట జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా మృణాల్ ఠాకూర్ స్వయంగా స్పందించి క్లారిటీ ఇచ్చారు. తనపై వస్తున్న పుకార్లపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఘాటైన సమాధానం ఇచ్చారు. ఇటీవల ముంబైలోని బాంద్రా ప్రాంతంలోని ఓ కేఫ్ నుంచి మృణాల్ ఠాకూర్, యశస్వి జైస్వాల్ వేర్వేరు సమయాల్లో బయటకు వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో వీరిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందంటూ నెటిజన్లు ఊహాగానాలు మొదలుపెట్టారు. ఇద్దరూ కలిసి కనిపించకపోయినా.. ఒకే ప్రాంతంలో కనిపించడం డేటింగ్ రూమర్స్‌కు కారణమైంది. ఈ వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో చివరకు మృణాల్ స్పందించాల్సి వచ్చింది. యశస్వి జైస్వాల్‌తో మృణాల్‌ను లింక్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన ఓ పోస్టుపై ఆమె ఘాటుగా స్పందించారు. నిరాధారమైన వార్తలను ప్రచారం చేయడంపై అసహనం వ్యక్తం చేస్తూ.. అసలు తన పక్కన యశస్వి ఎక్కడ ఉన్నాడో చూపించాలని ప్రశ్నించారు. చదువుకున్న వారు కూడా ఇలాంటి ఆధారాలు లేని వార్తలను ఎలా నమ్ముతున్నారో అర్థం కావడం లేదని ఆమె వ్యాఖ్యానించారు. దేశంలో ఎన్నో ముఖ్యమైన విషయాలు జరుగుతున్నాయని, వాటిపై దృష్టి పెట్టకుండా ఇలాంటి చిల్లర వార్తలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని సూచించారు. మృణాల్ వ్యాఖ్యలతో యశస్వి జైస్వాల్‌తో తనకు ఎలాంటి డేటింగ్ సంబంధం లేదనే విషయాన్ని ఆమె స్పష్టం చేసినట్లయింది. మృణాల్ ఠాకూర్ పేరు డేటింగ్ రూమర్స్‌లో వినిపించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో తమిళ స్టార్ హీరో ధనుష్‌తో ఆమె ప్రేమలో ఉన్నారని, త్వరలోనే వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారంటూ కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలను కూడా మృణాల్ వర్గాలు ఖండించాయి. తాజాగా యశస్వి జైస్వాల్‌తోనూ ఇలాంటి వార్తలు రావడంతో.. తాను ఎక్కడ కనిపించినా, తన చుట్టూ ఉన్న వ్యక్తులను బట్టి సంబంధాలు అంటగట్టడం సరికాదని మృణాల్ పరోక్షంగా అసహనం వ్యక్తం చేశారు. మృణాల్ ఠాకూర్ తెలుగు ప్రేక్షకులకు 'సీతారామం' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఈ చిత్రంలో సీతామహాలక్ష్మి పాత్రలో ఆమె నటనకు విశేష ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత 'హాయ్ నాన్న', 'ది ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాల్లోనూ నటించారు. ప్రస్తుతం పలు భాషల్లో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు

# ట్రైలర్ వచ్చేది ఆరోజే!



రవితేజ నటిస్తున్న ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా 'ఇరుముడి' ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. ఆధ్యాత్మిక విశిష్టత కలిగిన టైటిల్ కావడంతో ఈ సినిమా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. తండ్రీకూతుళ్ల అనుబంధం, ఆధ్యాత్మిక అంశాల కలబోతగా కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'ఇరుముడి కట్టు' అనే అయ్యప్ప భక్తి ప్రధాన పాటతో పాటు ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ నెల 12న భీమవరంలో జరిగే వేడుకలో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో రవితేజ రెండు పూర్తి భిన్నమైన అవతారాల్లో కనిపిస్తున్నారు. కూతురిని అమితంగా ప్రేమించే తండ్రిగా రవితేజ పాత్ర తీవ్ర భావోద్వేగాలు, సంఘర్షణతో సాగుతుందని..ఇప్పటివరకు ఆయన ఈ తరహా పాత్రలో నటించలేదని మేకర్స్ తెలిపారు. ప్రియాభవానీశంకర్, సాయికుమార్, బేబీ నక్షత్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: శివ నిర్వాణ.




# నానికి జోడీగా?

'లెనిన్'తో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకున్నది పూణే వయ్యారి భాగ్యశ్రీ బోర్సే. దీంతో ఈ అందాల భామకు అద్భుతమైన అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ అగ్ర హీరో శివకార్తికేయన్ సరసన 'సెయోన్' సినిమాలో నటిస్తూ భాగ్యశ్రీ బోర్సే బిజీగా ఉన్నది.

తాజా సమాచారం ప్రకారం టాలీవుడ్ అగ్ర హీరో నాని హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'బ్లడీ రోమియో' చిత్రంలోనూ కథానాయికగా భాగ్యశ్రీ బోర్సే పేరునే పరిశీలిస్తున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. సంప్రదింపులు కూడా జరిగాయని, త్వరలోనే దీనిపై పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తున్నది. మలయాళ అగ్ర నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనున్నారు. అక్టోబర్ నుంచి చిత్రీకరణ మొదలు కానున్న ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# బోనాల ఎఫెక్ట్.. 'కొరియన్ కనకరాజు'కి కలిసి వచ్చిన లాంగ్ వీకెండ్!



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. ఇండోకొరియన్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఇదిలా ఉంటే హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణం, వరుస సెలవులు ఈ సినిమా కలెక్షన్లకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

తెలంగాణలో వైభవంగా జరిగే బోనాల పండుగ నేపథ్యంలో నగరంలో వరుసగా మూడు రోజులు (శనివారం, ఆదివారం, సోమవారం బోనాల సెలవు) లాంగ్ వీకెండ్ వచ్చింది. దీంతో మూడు రోజులు సెలవు దినాలు కావడంతో.. థియేటర్లకు ఫ్యామిలీ ఆడియన్స్, యూత్ పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది.

ఈ అదనపు సెలవు దినాల వల్ల 'కొరియన్ కనకరాజు' వసూళ్లు మరింత బలపడతాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొదటి రోజే ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన ఓపెనింగ్స్‌ను రాబట్టి బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తున్న ఈ చిత్రానికి, ఈ లాంగ్ వీకెండ్ అదనపు ఊపునివ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**